క్లుప్తంగా

సాగుకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా

దెందులూరు: సాగుకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ బుధవారం తెలిపారు. విజయరాయి, బాపిరాజుగూడెం, అయ్యప్పరాజుగూడెం, జానంపేట, పెదవేగి, కూచింపూడి, రామశింగవరం, రాయుడుపాలెం, కవ్వగుంట, ఆసన్నగూడెం, ధర్మాజీగూడెం, మొండూరు, గాలాయగూడెం, తంగెళ్లమూడి, గుడిగుంట, జోగన్నపాలెం రైతులు రెండు దఫాలుగా విద్యుత్ సరఫరా చేస్తున్న విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

పంట ఉత్పత్తులను జాగ్రత్త చేసుకోండి



పెదపాడులో రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి

పెదపాడు: రైతులు తమ పంటలను జాగ్రత్త చేసుకోవాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎల్ దేవకీదేవి రైతులకు సూచించారు. బుధవారం పెదపాడులోని పంట పొలాలను డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు పలు సూచనలు చేసారు. తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి, మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే దేశాభివృద్ధి సాధ్యం



భీమడోలులో 2కే రన్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

భీమడోలు: ఐక్యతతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధిస్తుందని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ అన్నారు. ఎన్‌సీసీ డే ఉత్సవాల్లో భాగంగా 19 ఆంధ్రా బెటాలియన్ కల్నల్ అమిత్ పాండే ఆదేశాల మేరకు బుధవారం ఐక్యత పరుగును బుధవారం ప్రారంభించారు. రెండు కిలోమీటర్ల పరుగు పందెంను ప్రిన్సిపల్ జెండా ఊపి ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు పరుగు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాంతీయ, భాష, మత, కుల బేధాలు లేకుండా ఐక్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ కె.శివశంకర్, అధ్యాపకులు ఏ.మాధవి, డీఎస్‌టీ భవానీ సింగ్, ఎన్ఎస్ఎస్ అధికారులు శశికాంత్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ పీ. సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకుగాను ఏలూరులోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం, విద్యుత్ భవన్‌లో 9440902926 నెంబర్‌తో 24 గంటలపాటు 3 షిఫ్టుల్లో పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

తల్లిదండ్రుల సమావేశం వాయిదా వేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఆనవాయితీ ప్రజల్లో ఉందని, కానీ అదే రోజున (డిసెంబర్ 7న) మెగా పేరెంట్స్ మీటింగ్ పేరిట తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వాయిదా వేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డీఈఓ వెంకటలక్ష్మమ్మను ఆమె కార్యాలయంలో పీఆర్‌టీయూ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలలకు షష్టి రోజున స్థానిక సెలవు ప్రకటించుకునే పరిస్థితి ఉండేదన్నారు. దీనిపై పునరాలోచించి ఈ సమావేశాన్ని మరో రోజుకు వాయిదా వేయాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, నాయకులు ఎం. రాంబాబు, ఎస్‌డీ ముర్సలీన్ ఉన్నారు.

విద్యార్థులకు భరోసా

దెందులూరు: ఆర్టీసీ బస్సు ఆలస్యం కావడంతో కళాశాల విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. బుధవారం రాత్రి నిర్దేశిత సమయం కన్నా చాలా ఆలస్యంగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సును ఇకపై ఆలస్యం లేకుండా వచ్చేలా చర్యలు తీసుకుంటానని విద్యార్థులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హామీ ఇచ్చారు. వంగూరు, జగన్నాథపురం గ్రామాలకు చెందిన తామంతా బస్సు ఆలస్యంగా రావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు విద్యార్థులు వివరించారు. దీంతో ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆలస్యం లేకుండా బస్సులు నడపాలని ఆదేశించారు.

అధ్వానంగా పుంత రహదారులు

- వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు అవస్థ
- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న వైనం
- అభివృద్ధి చేయాలని కోరుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా శ్రీరామపురం పుంత రోడ్డు



ఛిద్రమైన మొయ్యేరు పుంత రోడ్డు

గణపవరం: రైతులు వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తెచ్చుకోవడానికి, ఇతర అవసరాలకు ఎంతో ఉపయోగపడే పుంత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీనితో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చిత్తడి నేల కావడంతో కొద్దిపాటి వర్షం పడితే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. పెద్ద గోతులు, గాడులు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కరంగా తయారయ్యాయి. దీనితో రైతులు తమ పొలాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇక తుఫాన్లు, భారీ వర్షాల సమయంలో రైతుల అవస్థలు వర్ణనాతీతం. గతంలో ఏఎంసీ నిధులు, ఉపాధి హామీ పథకంలో పుంత రహదారులను అభివృద్ధి చేసేవారు. కొంత కాలంగా రహదారుల నిర్మాణం ఊసే లేకుండా పోయింది. దీనితో రైతులు తమ పొలాలకు నారు, ఎరువులు, పురుగు మందులు చేరవేసేందుకు నానా పాట్లు పడుతున్నారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తీసుకురావడం తలకుమించిన భారంగా తయారైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ధాన్యం తీసుకు వచ్చే వాహనాలు పెద్ద గోతుల్లో దిగబడిపోవడంతో రైతులు బస్తాలను కిందిదికి దించి, మరలా ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల మీదికి ఎక్కించవలసి వస్తోంది. దీనివల్ల అదనంగా సొమ్ము, సమయం వృథా అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ కమిటీ మారినా ఫలితం శూన్యం

గణపవరం మండలం గతంలో అత్తిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉండేది. అప్పట్లో అత్తిలి ఏఎంసీకి వచ్చే ఆదాయంలో సింహభాగం గణపవరం మండలం నుంచే వచ్చేది. అయినా ఆ సమయంలో మండలానికి తగినన్ని నిధులు మంజూరయ్యేవి కావన్న ఆరోపణలున్నాయి. అప్పట్లో వచ్చిన అరకొర నిధులతో అక్కడక్కడా పుంత రోడ్లకు మరమ్మతులు చేసేవారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం గణపవరం మండలాన్ని ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోకి చేర్చారు. ఇప్పుడైనా మండలానికి న్యాయం జరుగుతుందని తగినన్ని నిధులు వస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.

70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి

గణపవరం మండలంలో రబీ, ఖరీఫ్ సీజన్లలో సుమారు 70 నుంచి 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. ఇందులో 75 శాతం ధాన్యం సమీపంలోని ఖాళీ స్థలాల్లోకి, రోడ్లపైకి, ఖాళీ ప్రదేశాలకు తరలించడానికి పుంత రోడ్లే శరణ్యం. గణపవరం మండలంలో సుమారు 45 పుంతరోడ్లు ఉండగా 30 రోడ్ల వరకూ అధ్వానంగానే ఉన్నాయి. పుంత రహదారుల విస్తీర్ణం 105 కి.మీ. కొన్ని పుంతరోడ్లు కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్నాయి. ఏటా పుంత రోడ్ల అభివృద్ధికి నిధుల కోసం పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలు పంపడం మినహా నిధులు మాత్రం మంజూరు కాక పోవడంతో రోడ్ల పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది. కనీసం ఈ సీజన్‌లోనైనా పుంతరోడ్లను అభివృద్ధి చేసి రైతుల కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

దెందులూరు: జాతీయ రహదారి నుంచి గుండుగొలను వెళ్లే దారిలో వంతెన పనులను వెంటనే పూర్తి చేయాలని గుండుగొలను గ్రామస్తులు బుధవారం శింగవరంలో డిమాండ్ చేశారు. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల పరిధిలోని ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరమైన గుండుగొలను వంతెన పనుల జాప్యంపై వారు నిరసన వ్యక్తం చేశారు. దీనివల్ల వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది మంది ప్రజల ప్రయాణ అవసరాలను పరిగణలోకి తీసుకోకుండా వంతెన నిర్మాణం ఆలస్యం కావడం తమకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు వంతెన పనులను పర్యవేక్షించాలని కోరారు. వంతెన నిర్మాణ ప్రాంతాన్ని కేంద్ర రవాణా శాఖ డిప్యూటీ డైరెక్టర్ బృందం ఇటీవల పరిశీలించిందని, ఇకనైనా నిర్మాణ పనులు వేగవంతమవుతాయని ఆశిస్తున్నామన్నారు.

విష్ణు ఆలయంలో పూజలు

దెందులూరు: దెందులూరు విష్ణు ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు, గోపూజ నిర్వహించారు. విష్ణుమూర్తికి అభిషేకాలు చేసి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు లలిత సహస్రనామం పఠించారు. భక్తులకు కార్తీక ద్వాదశ వనభోజనాలు నిర్వహించారు.

వ్యాయామ కళాశాలలో సమస్యల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న సర్వశిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిర్మలకుమారి

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలను బుధవారం సర్వశిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిర్మలకుమారి పరిశీలించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నత్తానియేలుతో కలిసి లేడీస్ హాస్టల్, కిచెన్ షెడ్డు, ఇంటర్నల్ రోడ్డు, గ్రౌండ్, కోర్టు నిర్మాణంలో ఉన్న హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాశాలకు వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పలు అంశాలను పరిశీలించి బుధవారం సాయంత్రం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు. ఇటీవల ఎమ్మెల్యే చింతమనేని, జిల్లా కలెక్టర్ వ్యాయామ కళాశాలను పరిశీలించి సమస్యలను గుర్తించిన నేపథ్యంలో వారి ఆదేశాల అనుగుణంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కళాశాలకు వచ్చి సమస్యలను నివేదిక రూపంలో తీసుకువెళ్లడం సంతోషంగా ఉందని వ్యాయామ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ రత్నబాబు, పీడీ సాయి కోటి సిబ్బంది ఉన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



భీమడోలులో ఎన్నికల సిబ్బందికి సూచనలందిస్తున్న తహసీల్దార్ బి.రమాదేవి, ఎన్నికల పరిశీలకులు

భీమడోలు: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను పగడ్బందీగా, సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత సబంధిత అధికారులు, సిబ్బందిపై ఉందని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో సాగు నీటి వినియోగదారుల ఎన్నికల సిబ్బందికి బుధవారం ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రవర్తనా నియమావళిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్నికల పరిశీలకులు, భీమడోలు మండల మైనర్ ఇరిగేషన్ ఏఈ కె.లాజర్‌బాబు అధ్యక్షత వహించారు. ఎన్నికల నిర్వహణపై ట్రైనీ మాస్టర్లు ఎం.శరీన్, వి.జగదీష్ సిబ్బందికి అవగాహన కల్పించారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 11 మైనర్, మేజర్ సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయన్నారు. 20,528 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. ఎన్నికల్లో నామినేషన్లు వేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఈనెల 5వ తేదీగా నీటి పన్ను చెల్లించాలని, లేని పక్షంలో వారి నామినేషన్‌ను తిరస్కరిస్తామన్నారు. ఎన్నికల పరిశీలకుడు కె.లాజర్ మాట్లాడుతూ మండలంలోని గుండుగొలను, పూళ్ల, భీమడోలు, అంబర్‌పేట, ఆగడాలలంక, చెట్టున్నపాడు మేజర్, 5 మైనర్ సాగునీటి సంఘాలకు ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల సిబ్బంది చిత్తశుద్ధితో, జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, 200 మంది శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిరణకుమారి, వీఆర్వోలు వినయ్, శంకర్, డి.సింహాచలం, గ్రామకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సంరక్షణలో నిమగ్నం



వరి కుప్పలు వేస్తున్న రైతులు



ఆరబెట్టిన ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

దెందులూరు: వాతావరణ శాఖ రెండు రోజులు వర్ష సూచనలతో పాటు హై అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో గ్రామాల్లోని రైతులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. అన్ని గ్రామాల్లో కోతలు 70 శాతం పూర్తిగా అవడంతో ధాన్యం కళ్లల్లోనూ, రోడ్లపై రాశులుగా ఉంది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై చలిగాలు వీయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల సూచన మేరకు గోనె సంచులు తీసుకువచ్చి ఆరబెట్టిన ధాన్యాన్ని పట్టుబడి చేస్తూ, కొన్నిచోట్ల రోడ్డుపై ఆరబెడుతూ మరికొన్ని గ్రామాల్లో రాశులుగా పోసి టార్పాలిన్లు కప్పి సంరక్షించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఇంకొన్ని గ్రామాల్లో బుధవారం రైతులు ధాన్యాన్ని మిల్లులకు చేరవేస్తున్నారు.

ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించండి

గణపవరం: వాయుగుండం హెచ్చరికల దృష్ట్యా రైతులు వరికోతలను వాయిదా వేసుకోవాలని, పొలాల్లో ఉన్న ధాన్యం రాశులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయాధికారి పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి రైతులను కలిశారు. పొలాలు, పుంతల్లో ఉన్న ధాన్యం రాశులను సురక్షిత ప్రదేశాలకు తరలించి, తడవకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

గోవును పూజించాలి



నాచుగుంట గోశాలలో మాట్లాడుతున్న కృష్ణానంద భారతి స్వామి

ఉంగుటూరు: గోవును పూజించడం ద్వారా ముక్తి మార్గం కలుగుతుందని కృష్ణానంద భారతి స్వామి అన్నారు. బుధవారం నాచుగుంట గోశాలలో 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు జి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఆర్ఎస్ఎస్ విజయవాడ విభాగ్ సంఘం చాలక్ కోనేరు దుర్గాప్రసాదు మాట్లాడారు. ఈ సందర్భంగా మహా రుద్ర హోమం నిర్వహించారు. గోవులను భక్తులు పూజించారు.

వరి కోతలు నిలిపివేయాలి



భీమడోలులో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బి.రమాదేవి, ఏవో ఎస్‌పీవీ ఉషా

భీమడోలు: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మూడు రోజుల పాటు వరి కోతలు నిలిపివేయాలని రైతులకు తహసీల్దార్ బి.రమాదేవి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణితో కలిసి తహసీల్దార్ బి.రమాదేవి క్షేత్ర సందర్శనలో పాల్గొన్నారు. పూళ్ల సొసైటీలో ధాన్యం సేకరణ రికార్డులు, రిజిస్టర్లను వారు పరిశీలించారు. గోడౌన్‌లో ఉన్న గోనె సంచుల నాణ్యతను పరిశీలించి వీఏఏలకు సూచనలందించారు. భీమడోలు, కురెళ్లగూడెం, పూళ్ల గ్రామాల రహదారులపై ఆరబోసిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. రైతుల నుంచి వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎస్‌కేల ద్వారా రైస్ మిల్లులకు త్వరితగతిన ధాన్యం తరలించుకునే విధంగా వీఏఏలు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే ధాన్యాన్ని గోనె సంచుల్లో భద్రపర్చుకుని వాటిపై టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి చిన్నారావు, వీఏఏలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారయత్నంపై విచారణ



గోపన్నపాలెంలో పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న ఎంఈఓ అన్నమ్మ

దెందులూరు: గోపన్నపాలెం శివారు మసీదుపాడులో బాలికపై అదే గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి అత్యాచార యత్నం ఘటనపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి విచారణకు ఆదేశించారని దెందులూరు ఎంఈవో కే అన్నమ్మ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో ఎంఈవో విచారణ నిర్వహించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం, ఉపాధ్యాయులను వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థి హాజరును పరిశీలించారు. అన్ని వివరాలు నమోదు చేసుకుని నివేదికను కలెక్టర్‌కు అందజేశారని విచారణ అధికారి ఎంఈవో అన్నమ్మ వివరించారు. కేసు నమోదు కావడంతో ప్రస్తుతం దెందులూరు పోలీసులు బాలుడిని ఏలూరు జువైనల్ హోమ్‌లో ఉంచారని తెలిపారు.

నేడు పెదవేగిలో రాష్ట్రస్థాయి పోటీలు

పెదవేగి : రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు గురువారం ప్రారంభించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె జయరాజు అన్నారు. పెదవేగిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు బాలురు, బాలికలకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారని పీడీ జయరాజు తెలిపారు.

విద్యార్థులకు కౌన్సెలింగ్

ఏలూరు టౌన్: విద్యార్థి దశలో ఆకతాయిగా ఉంటే వారి భవిష్యత్తు ప్రణాళిక చిన్న భిన్నమవుతుందని ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. ఏలూరు నగరంలోని బుధవారం రాత్రి సీఐ కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఏలూరు కొత్త బస్టాండ్ కళాశాలల ప్రాంగణాలలో జంటలుగా ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. యువత చెడు వ్యసనాలకు బానిసై కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు.

బాలబాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గుండుగొలనులో ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న వైద్యాధికారిణి

భీమడోలు: పాఠశాలల్లో చదువుకునే బాలబాలికల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్రీయ బాలల ఆరోగ్య సురక్ష కార్యక్రమం దోహద పడుతుందని గుండుగొలను వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మీ అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రాష్ట్రీయ బాలల ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 820 విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని సంబంధిత రికార్డుల్లో నమోదు చేసారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసారు. ఈ శిబిరాన్ని ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్, హెచ్ఎం గారపాటి సునీతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న ప్రతి విద్యార్థుల ఆరోగ్యం వివరాలను నమోదు చేస్తున్నామని తెలిపారు. బాలికల వ్యక్తిగత పరిశుభ్రతకు శానిటరీ న్యాప్‌కిన్లు అందిస్తున్నామన్నారు. ప్రతి గురువారం నీలిమాత్ర వేసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించుకోవచ్చునన్నారు. ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 2న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డేకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ మల్లేశ్వరి, సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎన్‌సీసీ అధికారి భీమేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించండి



సీతంపేట రైతుసేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: అన్ని గ్రామాల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి రైతులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం దెందులూరు సీతంపేట, ముప్పవరం, శింగవరం గ్రామాల్లో రైతులను కలిశారు. రోడ్లపై అరబోసిన ధాన్యాన్ని వెంటనే బస్తాల్లో నింపి మిల్లులకు తరలించాలన్నారు. వాతావరణ శాఖ రెండు రోజులపాటు తుఫాను హెచ్చరికతోపాటు హై అలర్ట్ ప్రకటించినందున రైతులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. సీతంపేటలోని రైతు సేవ కేంద్రానికి వెళ్లి స్టాకు రికార్డులను పరిశీలించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, సీతంపేట వీఆర్వో కిషోర్ ఉన్నారు. స్పందనలో నాగ హనుమాన్ ఫ్యాక్టరీపై అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ బి సుమతి బుధవారం ఫ్యాక్టరీని పరిశీలించారు. ఆమె వెంట కాలుష్య నియంత్రణ అధికారులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ



ఉంగుటూరులో ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాదు

ఉంగుటూరు: సాగునీటి సంఘాలకు ఈనెల 8 నిర్వహించే ఎన్నికలు పారదర్శకంగా సజావుగా జరిగేలా ఎన్నికల సిబ్బంది పనిచేయాలని ఉంగుటూరు ఇన్‌చార్జి తహసీల్దారు పూర్ణ చంద్రప్రసాదు అన్నారు. బుధవారం ఉంగుటూరులో నియోజకవర్గ స్థాయిలో సాగునీటి సంఘాలకు చెందిన సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. 222 మంది ఎన్నికల సిబ్బంది శిక్షణ పొందారు. పోలవరం కుడి కాలువ ఏఈ సీహెచ్ బాపూజి పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అడ్డుకోవాలి



నారాయణపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని క్రాప్ కో–ఆర్డినేటర్లు ఆర్.వినోద్‌కుమార్, సీహెచ్ రేఖలు అన్నారు. మండలంలోని నారాయణపురంలో బుధవారం చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహరహిత గ్రామంగా తీర్చి దిద్దేందుకు, క్రాప్ కోఆర్డినేటర్ ఆర్. వినోద్‌కుమార్, సీహెచ్ రేఖ నేతృత్వంలో అరికడదాం బాల్యవివాహాన్ని అనే నినాదంతో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. బాల్య వివాహాలను అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

భీమడోలు: గుండుగొలను గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పలువురు కోరారు. గుండుగొలనులో బుధవారం రాత్రి చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్, క్రాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో అరికడదాం.. అరికడదాం బాల్య వివాహాన్ని అనే నినాదంతో కొవ్వొత్తుల ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్లు ఆర్.వినోద్‌కుమార్, ఆర్.అమరావతి మాట్లాడుతూ బాల్య వివాహాలను నియంత్రించడంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. బాల్య వివాహాల పట్ల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, డ్వాక్రా మహిళలు, యువతులు పాల్గొన్నారు.